

కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వినతిపత్రం అందజేశారు. 10లో



హుండీ ఆదాయం రూ.7.47 లక్షలు

జీచ్‌రోడ్డు(విశాఖ): పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ హుండీల ద్వారా రూ.7,47,607 ఆదాయం వచ్చింది.



ఆధిక్యంలో హిమాచల్‌ప్రదేశ్

రంజీ ట్రోఫీ ఎలైట్ బి గ్రూప్‌లో ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ 9 వికెట్లు కోల్పోయి 478 పరుగులు చేసింది. 10లో

న్యూస్‌రీల్

విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రజని

అరకులోయటౌన్: స్థానిక గురుకుల బాలుర (పీవీటీజీ) ఉన్నత పాఠశాలలో ఇటీవల బడ్నాయిని ప్రవీణ్ కుమార్ అనే విద్యార్థి మృతి చెందిన ఘటనపై పాడేరు టీడబ్ల్యూ డీడీ ఎల్.రజని సోమవారం విచారణ జరిపారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యా హక్కు చట్టానికి లోబడి విధులు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గంజాయి సాగు, వినియోగం నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. మెనూ ప్రకారంగా భోజనం పెట్టకపోతే నిర్వాహకులపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో గురుకులం ఓఎస్‌డీ పి.ఎస్.ఎన్. మూర్తి, ఏటీడబ్ల్యువో మల్లికార్జునరావు, గురుకుల కళాశాల కన్వీనర్ పారయ్య తదితరులు పాల్గొన్నారు.

హాట్ బెలూన్ ఏర్పాటు అభినందనీయం



హాట్ ఎయిర్ బెలూన్‌లో ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని పద్మాపురం ఉద్యానవనంలో హాట్ ఎయిర్ బెలూన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. సోమవారం ఆయన పద్మాపురం గార్డెన్ వద్ద హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి, నిర్వాహకుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాట్ ఎయిర్ బెలూన్ వల్ల పర్యాటకులు మంచిఅనుభూతి పొందుతారన్నారు. పర్యాటకాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుస్మిత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

2న గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గెస్ట్ టీచర్ల పోస్టుల భర్తీకి వచ్చే నెల 2న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఈ పోస్టులకు అభ్యర్థుల అర్హత వివరాలను ఐటీడీఏ నోటీస్ బోర్డులో ఉంచినట్టు ఆయన చెప్పారు. వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30లోపు ఐటీడీఏలోని గురుకుల సెల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. రంపచోడవరం గురుకుల బాలుర పాఠశాలలో నవంబరు 1న డెమో నిర్వహిస్తారని తెలిపారు. ఐటీడీఏ సమావేశం హాలులో నవంబరు 2న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అభ్యర్థులు డెమో, ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

గిరి సీమలో జాఫ్రా సిరులు

జాఫ్రా సాగు జిల్లాలో గిరిజన రైతులకు సిరులు కురిపిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం తీసుకువస్తోంది. అధిక పోషకాలు, ఔషధ గుణాలున్న జాఫ్రాకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. ఎప్పుడూ లేనంతగా గత సీజన్‌లో కిలో జాఫ్రాకు గరిష్టంగా రూ.240 ధర లభించడంతో ఇప్పుడు దీనిని వాణిజ్య పంటగా సాగుచేస్తున్నారు.

- జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో సాగు
- గత సీజన్‌లో రూ. 240 వరకు పలికిన కిలో ధర
- ఈ ఏడాది దిగుబడి, రేటుపై రైతుల ఆశలు



మారేడుమిల్లి ప్రాంతంలో జాఫ్రా తోట

రంపచోడవరం: జిల్లాలో సాగుచేసే జాఫ్రాకు అధిక ధర లభిస్తుండడంతో ఆదివాసీ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలం ఏజెన్సీలో కిలో జాఫ్రాకు రూ.70 మించి ధర లభించలేదు. గత పీవో సూరజ్‌గనోరే గిరిజనులు పండించే జాఫ్రాకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో పలు చర్యలు తీసుకున్నారు. ఆ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. గత సీజన్‌లో కిలో జాఫ్రాకు రూ.200 నుంచి రూ.240 వరకు ధర లభించింది. జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. అధికంగా రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం అప్పర్ ప్రాంతంలో పండిస్తున్నారు. ఈ ఏడాది జాఫ్రా సాగును ప్రోత్సహించేందుకు ఐటీడీఏ ఉద్యానవనశాఖ ద్వారా7,200 మొక్కలను గిరి జన రైతులకు అందజేశారు.ఉపాధిహామీ పథకం ద్వారా కూడా జాఫ్రా మొక్కలను రైతులకు అందజేశారు.

జనవరి నుంచి మార్కెట్‌లోకి..

గతంలో గిరిజనులు జాఫ్రా మొక్కలను పొలం చుట్టూ వేసేవారు. ఇప్పుడు అధిక ధర లభిస్తుండడంతో వాణిజ్య పంటగా సాగు చేసేందుకు ఆసక్తి చూపుతూ తోటలను పెంచుతున్నారు. జాఫ్రా గింజలను జనవరి నెలాఖరు నుంచి ఏప్రిల్ వరకు గిరిజన రైతులు సేకరిస్తారు. ఏటా చెట్టు కొమ్మలను నరికి జాఫ్రా కాయలను కోస్తారు. వాటిని ఎండ బెట్టి నూర్పడం ద్వారా గింజలను సిద్ధం చేస్తారు. ఒక ఎకరంలో 180 మొక్కలు ఉంటే 250 నుంచి 300 కిలోల దిగుబడి వస్తుంది. ఏటా చెట్ల కొమ్మలను నరకడంతో కొత్తగా చిగుళ్లు వచ్చి త్వరగా కాపునకు వస్తుంది. ఈ ఏడాది జిల్లాలో జాఫ్రా తోటల్లో కాపు ఆశాజనకంగా ఉంది. దిగుబడితో పాటు అధిక ధర లభిస్తుందని రైతులకు ఆశిస్తున్నారు. ఒడిశా లాంటి ప్రాంతాల్లో హెక్టారుకు 1400 కిలోల వరకు జాఫ్రా దిగుబడి వస్తోంది. మన జిల్లాలో దిగుబడి తక్కువగానే ఉంది. బయట ప్రాంత వ్యాపారులు రైతులకు ముందుగానే కొంత సొమ్ము చెల్లించి, సీజన్ ప్రారంభమైన తరువాత మార్కెట్ రేటును బట్టి ధర చెల్లించి జాఫ్రాను కొనుగోలు చేస్తారు.

సహజ సిద్ధమైన ఫుడ్ కలర్

జాఫ్రా గింజల నుంచి సహజ సిద్ధమైన ఫుడ్‌కలర్స్‌ను తయారు చేస్తారు. విదేశాల్లో జాఫ్రాకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ కొనుగోలు చేసిన జాఫ్రా గింజలను వ్యాపారులు గుజరాత్, ఢిల్లీ మార్కెట్‌కు తరలిస్తారు. కేక్‌ల తయారీలో ఈ గింజల పేస్ట్‌ను వినియోగిస్తారు. గిరిజన మహిళలు ఈ గింజలను లిప్‌స్టిక్‌గా వాడతారు.

ధరలపై నవంబరులో సమావేశం

జాఫ్రా ధరలకు సంబంధించి నవంబర్‌లో సమావేశం నిర్వహిస్తాం. గత ఏడాది మాదిరిగానే కమిటీలు ఏర్పాటు చేసిన గిరిజన రైతులను మార్కెట్ రేట్ల విషయంలో చైతన్య పరుస్తాం. గత సీజన్‌లో ఎవరూ ఊహించని విధంగా మంచి ధర లభించింది. రూ.150 వరకు ధర వస్తేనే లాభం వస్తుంది.

– చిట్టిబాబు, పీహెచ్‌వో, రంపచోడవరం

ప్రత్యామ్నాయ పంటలతో గంజాయికి చెక్

కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో ఎస్పీ అమిత్‌బర్దర్,జేసీ అభిషేక్‌గౌడ్

సాక్షి,పాడేరు: ప్రత్యామ్నాయ పంటల సాగుతో గంజాయికి చెక్ పెట్టాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలుశాఖల అధికారులతో గంజాయి సాగు నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి సాగు నిర్మూలనపై గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలలు,కళాశాలల్లో విద్యార్థులకు వివరించాలని తెలిపారు. గంజాయి సాగు,వినియోగం,రవాణాపై 9381123100 అనే ఫోన్ నంబర్‌కు సమాచారం అందజేస్తే నగదు బహుమతి ఇస్తామని చెప్పారు.

2,241 మంది రైతులకు రాజ్‌మా విత్తనాలు

ఎస్పీ అమిత్‌బర్దర్ మాట్లాడుతూ 2,241మంది రైతులకు 400టన్నుల రాజ్‌మా విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా పంపిణీ చేసినట్టు చెప్పారు. యువత గంజాయి వినియోగానికి దూరంగా ఉండాలన్నారు.అటవీశాఖ ద్వారా 153 గ్రామాల్లో గంజాయి సాగుపై సర్వే చేసినట్టు చెప్పారు.వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో 34 ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేశామని,బ్యాంకుల్లో పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరిగితే బ్యాంకు అధికారులు తగిన సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు,గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజనీ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,డీఆర్‌డీఏ పీడీ మురళీ,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ల నిర్మాణానికి అటవీ,రెవెన్యూ శాఖల ఆమోదం

సాక్షి, పాడేరు: జిల్లాలో నిర్మించనున్న సెల్‌టవర్లు, ఓఎఫ్‌సీ కేబుళ్ల లైన్‌లకు అటవీ,రెవెన్యూ శాఖలు ఆమోదం తెలిపాయని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ చెప్పారు.కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలపై చర్చించారు. పెదబయలు మండలంలోని ఎగువ బందపల్లి, డుంబ్రిగుడ మండలం నారింజవలస, మారేడుమిల్లి ప్రాంతంలోని గుడిసెలో సెల్‌టవర్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రంపచోడవరంలో ఏడు రోడ్లు, పాడేరులో రెండు రోడ్లు, హుకుంపేటలో ఎనిమిది రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలపై త్వరితగతిన జాయింట్ పరిశీలన జరిపి, ఫారం ఎ,బి లను నవంబర్ 15న జరిగే డీఎల్‌సీ సమావేశం నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అడ్డతీగల, మారేడుమిల్లిలో జియో టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని,పర్యాటక ప్రాంతాల్లో నిర్మించే రహదారుల వల్ల ఎకో టూరిజం, పర్యావరణానికి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు.ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్,సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఆర్‌వో పద్మావతి,పలు ఇంజినీరింగ్ విభాగాల ఈఈలు బాలసుందరబాబు, జవహర్‌కుమార్, వర్చువల్‌లో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం,సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, పాడేరు,చింతపల్లి డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.

కూనవరం రేంజ్‌లో పులి సంచారం

- అప్రమత్తమైన అధికారులు
- జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక



కూనవరం వైపు వస్తున్న వాహనాలను మళ్లిస్తున్న అటవీ, పోలీస్ సిబ్బంది

కూనవరం: కూనవరం అటవీ రేంజ్ పరిధిలో పులి సంచరిస్తుండడంతో అటవీ,పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. ఆదివారం రాత్రి 8.30గంటల సమయంలో వీఆర్‌పురం గ్రామస్తులు కొందరు చింతూరు నుంచి కూనవరం రోడ్డు మీదుగా కారులో వస్తుండగా లింగాపురం సమీపంలో రోడ్డు పక్కన అరుస్తూ పులి కనిపించింది. సమాచారం అందుకున్న అటవీ, పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమై చట్టి జంక్షన్ వద్ద వాహనాలను దారి మళ్లించి పంపించారు. కూనవరం నుంచి చింతూరు, చింతూరు నుంచి కూనవరం వైపు వెళ్లే వాహనాలను వీఆర్‌పురం మీదుగా పంపారు. సోమవారం మండల పరిధిలోని లింగాపురం అటవీ ప్రాంతంలో పులి జాడపై అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేసి, పాదముద్రను గుర్తించినట్టు ఎఫ్ఆర్‌వో కరుణాకర్ తెలిపారు. రెండు వారాల క్రితం కూనవరం అటవీ రేంజ్ పరిధిలోని తాటిలంక, దూగుట్ట గ్రామాల పరిసరప్రాంతాల్లో సంచరించిన పులి తరువాత ఐదారు రోజులక్రితం వరకు కనిపించక పోవడంతో అడవిని వదిలి దూరంగా వెళ్లిందని భావించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి లింగాపురం అటవీప్రాంతంలో మళ్లీ కనిపించడంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. డీఫ్‌వో బబిత ఆదేశాల మేరకు ఎటపాక సీఐ ఎం.కె. రాజు, చింతూరు సీఐ దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. రాత్రి ఆరు గంటల దాటిన తరువాత బయటకు రావద్దని, పశువులను మేపేందుకు, వేటాడేందుకు అడవికి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

విశాఖ విద్య: స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. డీఈవో కార్యాలయ ప్రాంగణంలో అసోసియేషన్ సభ్యులు సమావేశమయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.ఆనంద్ రెడ్డి(సూపరింటెండెంట్ ఆర్జేడీ ఆఫీస్ విశాఖ), ప్రధాన కార్యదర్శిగా కె.రామలింగేశ్వర రావు(సూపరింటెండెంట్, డీఈవో ఆఫీస్ అనకాపల్లి), కోశాధికారిగా ఇ.కృష్ణ చైతన్య(సీనియర్ అసిస్టెంట్ ఆర్జేడీ ఆఫీస్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.జగన్నాథరావు(సూపరింటెండెంట్, డీఈవో ఆఫీస్ అనకాపల్లి), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.చక్రధర్‌రావు (సూపరింటెండెంట్, డీఈవో ఆఫీస్, ఏఎస్ఆర్ జిల్లా)ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.బంగారమ్మ, వి.పెంటారావు, జి.జ్యోత్స్న, ఎస్.మంగమ్మ, శైలజా కుమారిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు విద్యాశాఖలోని వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న పలువురిని అసోసియేషన్‌కు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులకు ఎంపిక చేశారు. డీఈవో ప్రేమ్‌కుమార్ సమావేశానికి హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

గ్రామ సభల తీర్మానాలతో కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: గ్రామ సభల తీర్మానాలతో అన్ని గిరిజన కులాలకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 75 అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్జీలు అందజేసిన వారి సమస్యలను సత్వరం పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. లొంగిపోయిన మాజీ మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదు ఎకరాల భూమిని మంజూరు చేయాలని ఆదివాసీ చైతన్య వేదిక సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, మడిగొంట వెంకటేశ్వర్లు అర్జీ అందజేశారు.వాల్మీకి కులధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల వాల్మీకి తెగకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె చిన్ననారాయణ, ఎం.పాల్‌బాబులు పీవో, సబ్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సబ్ కలెక్టర్ గంట వ్యవధిలోనే ఆ సమస్యను పరిష్కరించారు. వై.రామవరం మండలంలోని దారగెడ్డ, గుర్తేడు, పాతకోట, కానివాడ, బొడ్డగండి పంచాయతీల్లో రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీపీ కె.ఆనంద్, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి అర్జీ అందజేశారు. మంగంపాడులో పీహెచ్‌సీ భవన నిర్మాణం మధ్యలో నిలిచి పోయిందని, పనులు పూర్తి చేయాలని సారముకోట అబ్బాయిరెడ్డి, కోండ్ల శివశంకర్ రెడ్డి కోరారు.

ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- సంత్రగచ్చి మధ్య స్పెషల్ రైలు



తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- సంత్రగచ్చి మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి(06133) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో సోమవారం రాత్రి 7.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.45 గంటలకు దువ్వాడకు అదేరోజు రాత్రి 11.30 గంటలకు సంత్రగచ్చి చేరుకంటుంది. తిరుగు ప్రయాణంలో సంత్రగచ్చి- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(06134) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం 10.10 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరి బుధవారం మధ్య రాత్రి 1.50 గంటలకు దువ్వాడకు అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

సందడి లేని దీపావళి

దీపావళి అంటేనే బాణసంచా వెలుగులు.. పిల్లల కేరింతలు... సరదాలు. అలాంటి వెలుగుల వేడుక సందడి ఈ ఏడాది జిల్లాలో పెద్దగా కనిపించడం లేదు. కాఫీ దిగుబడి ఇంకా రాకపోవడంతో రైతుల చేతిలో చిల్లి గవ్వ లేదు... నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరగడంతో కుటుంబ పోషణకే సామాన్య, మధ్య తరగతి ప్రజలు నెలనెలా అప్పులు చేయవలసిన పరిస్థితి... ఆ ప్రభావం పండగలపై పడుతోంది. దీంతో దీపావళి అంటేనే హడలిపోయే దుస్థితి ఏర్పడింది.

- భారీగా బాణసంచా ధరలు
- అనుకూలించని ఆర్థిక పరిస్థితులు
- సతమతమవుతున్న ప్రజలు



బాణసంచా సామగ్రి

సాక్షి,పాడేరు: జిల్లాలో 85 శాతం మంది గిరిజనులు జీవిస్తున్నారు. వారిలో 60శాతం పేద రైతు కుటుంబాల వారే. అందరికీ వ్యవసాయమే ఆధారం. ప్రస్తుతం కాఫీ పంట దిగుబడి రాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీబీటీ కార్యక్రమాల అమలుతో పేదలు, రైతు కుటుంబాలు, ఇతర వర్గాల వద్ద ఎంతో కొంత నగదు ఉండేది. కూటమి ప్రభుత్వం పథకాలేవీ అమలు చేయకపోవడంతో ఇప్పుడా పరిస్థితి లేదు. దీంతో దీపావళి ఎలా చేసుకోవాలో అర్థంకాక అధిక శాతం మంది ఆందోళనలో ఉన్నారు. ధరలు కూడా విపరీతంగా పెరగడంతో చిన్నకుటుంబానికి కొద్దిపాటి బాణసంచా, ఇతర పిండివంటలకు కనీసం రూ.3 వేలు ఖర్చు అవుతుంది. దీంతో దీపావళి పండగ చేసుకోవాలంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలు అప్పు చేయక తప్పడం లేదు.

వ్యాపారుల్లో ఆందోళన

గత ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వరకు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. సుమారు రూ.5 కోట్ల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది కూడా దుకాణాల ఏర్పాటుకు 40 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో వ్యాపారి సుమారు రూ.6 లక్షల విలువ చేసే సరకును హోల్‌సేల్ దుకాణాల్లో ఖరీదు చేసి, రిటైల్‌గా విక్రయిస్తారు. బాణసంచా విక్రయానికి వ్యాపారులు సిద్ధమవుతున్నప్పటికీ ఈ ఏడాది మొత్తం సరకు విక్రయించగలమా? లేదా? అన్న ఆందోళన నెలకొంది.

పండగ సరదా కనిపించడం లేదు



ఇప్పుడు దిగుబడికి వచ్చే పంటలేవీ లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా రైతు కుటుంబాల వద్ద నగదు లభ్యత దాదాపు శూన్యం. ప్రభుత్వం నుంచి రైతులకు ఎటువంటి ప్రోత్సాహక నగదు, ఆర్థిక సాయం అందలేదు. దీంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గిరిజన రైతు కుటుంబాలకు దీపావళి భారంగా మారింది. ఎవరిలోనూ పండగ సరదా కనిపించడం లేదు.

– పాలికి లక్కు, కాఫీ రైతుల సంఘం జాతీయ నేత, పాడేరు

అమ్మకాలు అనుమానమే



బాణసంచా సామగ్రి మొత్తం అమ్మడం అనుమానంగానే ఉంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా కనీస స్థాయిలో కూడా బాణసంచా కొనుగోలు చేసేందుకు సామాన్య, మధ్య తరగతి ప్రజలు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. ఎవరిలోనూ దీపావళి ఆనందం కనిపించడం లేదు. ఈఏడాది వ్యాపారం తగ్గే అవకాశం ఉంది. సరకును ఏదో విధంగా అమ్ముకోవాలనే చూస్తున్నాం.

– కరుణ, వ్యాపారి, పాడేరు

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

రంపచోడవరం: రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో అక్రమంగా బియ్యం నిల్వ చేసిన ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సలోమిని సస్పెండ్ చేసినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. కళాశాలలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం విషయం ఈ నెల 24న వెలుగులోకి వచ్చిందని, దీనిపై డీడీ విజయశాంతి ప్రాథమిక విచారణ జరిపి నివేదిక అందజేశారని చెప్పారు.కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. బియ్యం అక్రమ నిల్వకు సహకరించిన సిబ్బందిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపేందుక గిరిజన సంక్షేమశాఖ ఎస్‌డీసీ జాన్‌రాజును విచారణాధికారిగా నియమించినట్టు చెప్పారు. విద్యార్థినులతో బియ్యం బస్తాలను మోయించాడన్ని తీవ్రంగా పరిగణించినట్టు పీవో తెలిపారు.

విచారణకు అనకాపల్లి డీపీవో డుమ్మా

మళ్లీ బుధవారం విచారణ



జిల్లా పరిషత్ భవనం

మహారాణిపేట(విశాఖ): పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీపై విచారణకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి డుమ్మా కొట్టారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి విచారణ నిర్వహించారు. గత నెల 28,29న తేదీల్లో అడ్డగోలు బదిలీలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ జిల్లా పరిషత్ సీఈవోను ఆదేశించిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా జెడ్పీ సీఈవో విచారణ చేస్తున్నారు. సోమవారం విచారణకు రావాలని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ అధికారులకు నోటీసులు ఇచ్చారు. అయితే విచారణకు కీలకమైన అనకాపల్లి డీపీవో హాజరు కాలేదు. విశాఖ డీపీవో, ఏఎస్సార్ నూతన డీపీవో విచారణకు హాజరయ్యారు. బుధవారం ముగ్గురు డీపీవోలు విచారణకు రావాలని విచారణ అధికారి ఆదేశించారు. ఈవోపీఆర్‌అండ్ ఆర్‌డీల జాబితా తయారు చేయాలని, ఇప్పటి వరకు ఏజెన్సీలో ఎవరు పని చేయలేదో వివరాలు తెలియజేయాలని విచారణ అధికారి కోరినట్టు సమాచారం.

అవిగో... శుభ గడియలు

- ముగిసిన మూఢం
- వివాహ ముహూర్తాలు మొదలు
- డిసెంబర్ నెలాఖరు వరకు పెళ్లిళ్ల సీజన్
- కల్యాణ మండపాలు, పురోహితులకు డిమాండ్





ముహూర్తాలు ఇలా..

అక్టోబర్ 13,16,20.27

నవంబర్ 3,7,8,9,10,12,13,14,16,17,18. 22,23,25,26,28,29

డిసెంబర్ 4,5,6,7,8,9,11,12,14,15,16,26

యలమంచిలి రూరల్ : మూఢం ముగిసింది.. వివాహాది శుభకార్యాలకు అడ్డంకి తొలగిపోయింది. శుభ ఘడియలు సమీపించడంతో పెళ్లిళ్లకు ముహూర్తాల సందడి మొదలైంది. మూడు నెలల పాటు కొనసాగిన మూఢాలు ముగిసి, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో (అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు) మంచి లగ్నాలు ఉండడంతో వివాహాది శుభకార్యాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 13న ప్రారంభమైన మంచి ముహూర్తాలు డిసెంబర్ 30 వరకు ఉన్నట్టు వేద పండితులు చెబుతున్నారు. శుభ గడియలు రావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో పెళ్లిళ్లు, అనుబంధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. తర్వాత సంక్రాంతి పండుగ నెల కావడంతో మళ్లీ వచ్చే ఫిబ్రవరి వరకు ముహూర్తాల కోసం ఆగాల్సిందే. అందుకే ఈ ఏడాది దీపావళి తర్వాత పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఉపనయనాలు, గృహప్రవేశాలు కూడా ఎక్కువగా జరుగుతాయని పండితులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. అలాగే ఈవెంట్ మేనేజర్లు, కేటరింగ్, లైటింగ్, షామియానా, అలంకరణ కార్మికులకు ముందస్తు బుకింగ్‌లు జరిగాయి. మతాంతర వివాహాలు చేసుకునేవారు, అలాగే భారతీయ సంప్రదాయాలను గౌరవించే ఇతర మతస్తులు సైతం అదే ముహూర్తాల్లో తమ మతాచారాల ప్రకారం చర్చిలు, మసీదుల్లో వివాహాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలతో పాటు షాదీఖానాలు, చర్చిల ఆధ్వర్యంలోని మ్యారేజీ హాళ్ల బుకింగ్‌లు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మూడు నెలల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు వేలకు పైగా వివాహాలు జరగనున్నట్టు అంచనా.

మారిన ట్రెండ్

గతంలో వివాహాలంటే బ్యాండు మేళాలు, భాజాభజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి సాధారణంగా ఉండేవి. ఇప్పుడు ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్ల కోసం ఇతర లోకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులతో స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి వాటిని ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కల్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై ప్రదర్శించడం.. ఇలా విభిన్నంగా వేడుకను చేసుకునేందుకు ఈతరం వధూవరులు, వారి కుటుంబీకులు ఆసక్తి చూపుతున్నారు.

షాపింగ్ సందడి: విశాఖనగరం, గాజువాక, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం సహా మండల కేంద్రాల్లో వస్త్ర, బంగారు దుకాణాలన్నీ కొద్ది రోజులుగా కిటకిటలాడుతున్నాయి. బంగారు ఆభరణాల కోసం ఆర్డర్లు బాగానే వస్తున్నాయని యలమంచిలికి చెందిన ఓ బంగారు వ్యాపారి చెప్పారు. దీనికితోడు దీపావళి పర్వదినం నేపథ్యంలో విక్రయాలు జోరందుకున్నాయి.

ఫంక్షన్ హాళ్లకు డిమాండ్: వివాహ ముహూర్తాల నేపథ్యంలో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ బాగా పెరిగింది. ముందస్తుగా బుకింగ్స్ జరిగాయి. వీటి అద్దెలు భారీగా పెరిగాయి.

వివాహాలకు అనుకూలం



నవంబర్, సెంబర్ నెలల్లో చాలా మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలు శూన్యమాసం, భాద్రపద మాసం కావడంతో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. డిసెంబర్ నెలాఖరు వరకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

–పెద్దింటి సూర్యనారాయణమూర్తి, జిల్లా పురోహితుల సంఘం అధ్యక్షుడు

ఎస్పీ హామీతో ఆందోళన విరమణ



ముంచంగిపుట్టులో ఆందోళనకారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

ముంచంగిపుట్టు: వైస్ ప్రిన్సిపాల్ దాడితో మృతి చెందిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, పలు సంఘాల నేతలు, నాయకులు చేపట్టిన ఆందోళన ఆదివారం రాత్రి ఒంటిగంట వరకు సాగింది. రోడ్డుపై వారు బైఠాయించారు. మండల స్థాయి అధికారులు, ఎస్ఐలు ఆందోళనకారులతో నచ్చచెప్పే ప్రయత్నం ఎంత చేసినా ఫలితం కానరాలేదు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, పెదబయలు వైపు రాకపోకలు 8 గంటల పాటు పూర్తిగా స్తంభించినట్టు తెలుసుకున్న ఎస్పీ అమిత్ బర్దర్ ముంచంగిపుట్టు మండల కేంద్రానికి అర్ధరాత్రి చేరారు. ఆందోళనకారులు, విద్యార్థి బంధువులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని, విద్యార్థి మృతి విషయంలో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తామని ఎస్పీ అమిత్ బర్దర్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు. దీంతో ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎస్పీ పర్యవేక్షణలో పోలీపుట్టు గ్రామానికి పంపించారు. సోమవారం తెల్లవారుజామున విద్యార్థి దహన సంస్కరణ జరిగింది.

అరకు ఎంపీ తనూజరాణికి అభినందనల వెల్లువ



అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి,పాడేరు: కేంద్రంలోని రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కమిటీ సభ్యురాలిగా నియమితులైన అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మాజీ సర్పంచ్‌లు ఎస్.సూర్యనారాయణ, ఎం.కన్నాపాత్రుడు, పి.నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, ఆనంద్, సూరిబాబు, సింహచలంనాయుడు, కామేశ్వరరావు, సింహాచలం, సత్యనారాయణపాత్రుడు, రాంబాబు, రాజుబాబు తదితరులు సోమవారం పాడేరులోని ఎంపీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీ డాక్టర్ తనూజరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తనూజరాణి, భర్త చెట్టి వినయ్‌లను శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

ఉద్యానవనశాఖలో విలీనం చేయాలని వినతి

సాక్షి,పాడేరు: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యానవన అసిస్టెంట్లను ప్రభుత్వం ఉద్యానవనశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 72మంది ఉద్యాన వన అసిస్టెంట్లు సోమవారం జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు.జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం అధికంగా ఉన్నందున రైతులకు మేలు చేసేలా తమను ఉద్యానవనశాఖలో విలీనం చేయాలని కోరారు. సంఘం నాయకులు రాజు, గణపతి, రజిత, శివ, అనిల్, ఆనందరావు, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న ఏపీ ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామన్న దొర

అరకులోయటౌన్: ఏజెన్సీలో ఆదివాసీల సమస్యలపై అధికారులతో మాట్లాడేందుకు వామపక్షాల అనుమతి తీసుకోవాలా అని ఏపీ ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామన్న దొర ప్రశ్నించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23న కలెక్టర్ దినేష్ కుమార్‌తో జరిగిన చర్చల్లో విద్య, వైద్యం, స్వయం ఉపాధి, అభివృద్ధి రంగాల్లో అనేక సమస్యలపై చర్చించామన్నారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. అయితే ఈ సమావేశానికి కమ్యూనిస్టు ప్రతినిధులు పాల్గొనకుండా తమపై బురదజల్లే ప్రయత్నం చేయడం తగదన్నారు. ఆదివాసీ సమస్యలపై జేఏసీ తరపున నిరంతరం ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని పాఠశాల భవనాలు లేని 420 పాఠశాలలకు తాత్కాలిక షెడ్ల నిర్మాణానికి, నిధులు, రాజమండ్రి నుంచి మారేడుమిల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్ అంగీకరించినట్టు తెలిపారు. నాయకులు రాజబాబు, బలరాం, సురేష్‌బాబు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఎటపాక: తెలంగాణాకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎటపాక సీఐ కన్నపరాజు సీజ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి గుండాల ఇసుక ర్యాంపు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను భద్రాచలం తరలిస్తున్నారనే సమాచారంతో నిఘా పెట్టి గోళ్లగట్ట వద్ద పట్టుకున్నారు.ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

ఇసుక తరలించకుండా...



మారేలలో ఇసుక రవాణాను అడ్డుకునేందుకు రోడ్డుపై గొయ్యి తవ్వుతున్న మారేల గ్రామస్తులు

హుకుంపేట: ధనార్జనే ధ్యేయంగా కొందరు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తుండంపై ఆ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుకను రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సోమవారం ఏకంగా రోడ్డుపై పెద్దగొయ్యిని తవ్వారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో మారేల పరిసర ప్రాంతాల నుంచి నిత్యం ఇసుక రవాణా జోరుగా జరుగుతోంది. ఇసుక అక్రమ రవాణాను ఆపేందుకు రోడ్డుపై గొయ్యిని తవ్వినట్టు గ్రామస్తులు తెలిపారు. తమ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, రవాణాకు అధికారులు అనుమతిచ్చినా సరే మేం అంగీకరించబోమని వారు స్పష్టం చేశారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు వినతి



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.దినేష్‌కుమార్‌కు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను ఎమ్మెల్యే సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. జి.మాడుగుల మండలం మారుమూల కిల్లంకోట పంచాయతీ చింతగుప్ప,బూరెలుపనుకు,గొడ్డలికర్ర,రోలుగుంట గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.జాతీయ రహదారి 516ఈ నిర్మాణంలో భాగంగా జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీలోని వంజరి, కడగడ్డ, వరిగెలపాలెం, ములకాయపుట్టు గ్రామాలకు చెందిన 96 కుటుంబాలు అటవీ భూములు కోల్పోతున్నాయని, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా భూముల్లో సాగు చేస్తున్న కాఫీ,మిరియాల పంటలకు నష్ట పరిహారం చెల్లించిన తరువాతే జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. నెల రోజుల కిందట కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన జీకే వీధి మండలం చట్రాపల్లి బాధిత గిరిజనుల కుటుంబాలకు న్యాయం చేయాలని,చట్రాపల్లి,మాదిమల్లు గ్రామాలలో ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలను అందజేయాలని వినతిపత్రంలో కోరారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యేకు కలెక్టర్ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు తమ వ్యక్తిగత, గ్రామాల సమస్యలపై ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు క్యాంపు కార్యాలయంలో వినతులు అందజేశారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

అడ్డతీగల: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక విద్యార్థులు అర్హత సాధించారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు తరపున తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రదర్శన చూపారని హోసన్న పాఠశాల డీన్ ధన సందీప్, పీఈటీ సుందర్ తెలిపారు. బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.అంజలి, బాలుర విభాగంలో శామ్యూల్, నర్సయ్య, ప్రవీణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను హైస్కూల్ డైరెక్టర్ సందీప్, ప్రిన్సిపాల్ మృదుహాసిని, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నీకి ఎంపిక

- 29, 30 తేదీల్లో పోటీలు
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ పోటీలకు ఈనెల 29, 30తేదీల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్, కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది పోటీల్లో పాల్గొవాలని ఆయన కోరారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన వారంతా నవంబర్ 6 నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారి సంస్థ నిర్ణయించిన 18 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 29న పాడేరు తలారిసింగి క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, వాలీబాల్, టెబుల్ టెన్నిస్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. 30న అనకాపల్లి డావిన్స్ పాఠశాలలో స్విమ్మింగ్ పోటీలు, తలారిసింగి పాఠశాలలో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, కబడ్డీ, హాకీ, యోగా పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు ఆయా శాఖలు జారీ చేసిన గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 90002 74225 నంబర్‌కు సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

ఆధిక్యంలో హిమాచల్‌ప్రదేశ్

- వశిష్ట్ సెంచరీ, ధావన్ డబుల్ సెంచరీ మిస్
- 134 పరుగుల వెనుకబడిన ఆంధ్ర జట్టు

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీ ఎలైట్ బి గ్రూప్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రపై హిమాచల్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి హిమాచల్‌ప్రదేశ్ 9 వికెట్లు కోల్పోయి 478 పరుగులు చేసింది. నాలుగు వికెట్లకు 198 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆటను కొనసాగించగా... అకాష్ వశిష్ట్ 85 పరుగుల వద్ద రాజుకు క్లీన్‌బౌల్డ్ అయి సెంచరీని మిస్ చేసుకున్నాడు. కెప్టెన్ రిషిధావన్ సైతం 195 పరుగుల వద్ద మనీష్ బౌలింగ్‌లో వెనక్కి మళ్లి డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఐదో వికెట్‌కు వీరిజోడి 141 పరుగులు జోడించింది. ధావన్‌తో కలిసి ముకుల్(42) ఆరో వికెట్‌కు 121 పరుగులు జోడించడంతో ఆంధ్రపై తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యానికి చేరింది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ను 344 పరుగులుకు ముగించిన విషయం విదితమే. అర్పిత్(15), దివేష్(12) క్రీజ్‌లో నిలిచారు. శశికాంత్ నాలుగు వికెట్లు తీయగా రాజు మూడు వికెట్లు తీశాడు. విజయ్, మనీష్ చెరో వికెట్ తీయగలిగారు. నాలుగు రోజుల ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో హిమాచల్‌ప్రదేశ్ 134 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతుంది.

దారి దోపిడీకి యత్నం

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం సమీపంలో సోమవారం రాత్రి కొందరు దుండగులు దారిదోపిడీకి యత్నించారు. మాకవరం సర్పంచ్ గంగాధర్ సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో పనులు ముగించుకుని మాకవరం వస్తుండగా గంగమ్మతల్లి ఆలయం సమీపంలో ఐదుగురు వ్యక్తులు సర్పంచ్ బైక్‌ను ఆపి ,కత్తులు,తుపాకులతో బెదిరించి బైక్ తాళాలు,పర్సు,సెల్ ఫోన్ అడిగారు. సర్పంచ్ భయపడి వారికి పర్సు,సెల్ ఫోన్ ఇచ్చేశారు, బైక్ తాళాలు ఇచ్చే సమయంలో ఆ మార్గంలో బొలేరో వాహనం రావడాన్ని గమనించిన దొంగలు సెల్ ఫోన్‌ను తుప్పల్లో పడేసి, సర్పంచు గంగాధర్‌ను తోసివేసి, పర్సు పట్టుకుని ఒడిశా వైపు కొండప్రాంతానికి పరుగు పెట్టారు. ఆ మార్గంలో వస్తున్న బొలేరో వాహనాన్ని ఆపి, అందులో ఉన్న కుంబిరిపడ గ్రామానికి చెందిన వారికి సర్పంచ్ జరిగిన విషయం తెలియజేశారు. ఈ సంఘటనతో పరిసర గ్రామాల గిరిజనులు అప్రమత్తమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన వరహాలమ్మ

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ నడుమూరు సమీపంలో ఘాట్ రోడ్డు వద్ద సోమవారం ఉదయం ద్విచక్రవాహనం బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. అల్లమూల గ్రామానికి చెందిన అశోక్‌కుమార్, రామారావు, వరహాలమ్మ ద్విచక్రవాహనంపై ఏనుగురాయి పంచాయతీ కేంద్రానికి వస్తుండగా నడుమూరు ఘాట్ రోడ్డులో మలుపు వద్ద బైక్ బ్రేక్ ఫెయిలై అదుపుతప్పి గోతిలోకి దూసుకుపోయి బోల్తా పడింది. దీంతో గాయపడిన ముగ్గురిని స్థానికులు ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. స్థానిక వైద్యాధికారి సంతోష్ వైద్య సేవలు అందించారు. వీరిలో వరహాలమ్మ తీవ్రంగా గాయపడింది.ఆమెను మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.ప్రస్తుతం వరహాలమ్మ పరిస్థితి విషయంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులు పూర్తిచేయాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



అధికారులతో సమీక్షిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

సాక్షి,పాడేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పాడేరు ఐటీడీఏలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. అరకులోయ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2021నుంచి 2024 వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన బీటీ,గ్రావెల్,సీసీ రోడ్ల పెండింగ్ పనులపై ఆయన పంచాయతీరాజ్ ఈఈ తమర్భ కొండయ్యపడాల్,డీఈఈ రామం,అన్ని మండలాల ఏఈఈలతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.60 కోట్ల పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.పీఆర్ ఈఈ కొండయ్యపడాల్,ఇతర ఇంజనీరింగ్ అధికారులు మాట్లాడుతూ కాంక్రీట్ కొరత వల్ల పనులు వేగవంతంగా చేయలేకపోతున్నామని, ఈఏడాది డిసెంబర్ 31 నాటికి పెండింగ్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

230 మందికి వైద్య పరీక్షలు



కోతులగుట్ట సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు సోమాచారి, స్వాతి

కూనవరం: మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో హైదరాబాద్‌కు చెందిన వేస్కులర్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 230 మందికి వైద్య పరీక్షలు చేశారు. 65 మందికి శస్త్రచికిత్సలు అవసరమున్నట్టు గుర్తించారు. వారికి హైదరాబాద్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని వేస్కులర్ కేర్ సెంటర్ ఆస్పత్రి మేనేజర్ కుమార్ తెలిపారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్జన్‌లు సోమాచారి, స్వాతి వైద్యపరీక్షలు చేశారు. కోతులగుట్ట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ మైదానం అభివృద్ధికి రూ.20 లక్షలు

కేటాయించేందుకు ఎంపీ తనూజరాణి హామీ



ఎంపీ తనూజ రాణితో మాట్లాడుతున్న పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు

అరకులోయటౌన్: అరకులోయ పట్టణంలోని వాలీబాల్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ.20 లక్షల ఎంపీ కోటా నిధులు కేటాంచనున్నట్టు ఎంపీ డాక్టర్ తనూజ రాణి తెలిపారు. సోమవారం పాడేరులోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆమెను అరకులోయ పూర్వ విద్యార్థుల సంఘం, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. వాలీబాల్ క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం, జిమ్, వాకింగ్ ట్రాక్, ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎంపీ రూ.20 లక్షలు కేటాయించేందుకు హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పూర్వ విద్యార్థుల సంఘం, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బురిడి ఆనందరావు, మధుసూదనరావు, పోలు, రామారావు, రంగరాజు, భాస్కరరాజు, వెంకటరావు తదితరులున్నారు.

యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సతీష్

చోడవరం: రాష్ట్ర యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రముఖ యోగా గురువు పుల్లేటి సతీష్ నియమితులయ్యారు. సుమారు 15 ఏళ్లుగా చోడవరంలో పతంజలి యోగా కేంద్రం ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలకు సతీష్ యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న సతీష్‌ను తాజాగా రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.